క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణం లోని సీతారామపురంలో ఆదివారం 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, పలు ప్రాంతాలలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు మండలం, అనిగండ్లపాడు గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి లక్ష్మీనరసమ్మ, దిద్ది లలిత అనే వారిద్దరూ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, వారికి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం దిద్ది లలితకు రూ.50 వేలు, బొమ్మిశెట్టి లక్ష్మీనరసమ్మకు రూ 50 వేల చొప్పున ఎల్‌వోసీ చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం వారి నివాసంలో బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ సేవ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేం చేసి ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి గరుడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేక గరుడ వాహనంపై ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం గరుడ సేవ చేశామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రిత సాయిలో ఫ్రెషర్స్ డే వేడుకలు



కంచికచర్ల: పరిటాల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహనరావు శనివారం పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం చదవుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ, సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, మంచి ప్రణాళికలతో విద్యనభ్యసించాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ, స్టూడెంట్స్ క్లబ్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామ్‌కో సేవలు అభినందనీయం



బూదవాడ(జగ్గయ్యపేట): రామ్‌కో సిమెంట్స్ కర్మాగారం యాజమాన్యం గ్రామాల అభివృద్ధికి తమ వంతుగా ముందుకు రావటం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. గ్రామంలో ఇటీవల వరదలకు నిరాశ్రయులైన బాధితులకు శనివారం ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవత్సవ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి యాజమాన్యం అన్నివేళలా ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఫరూక్ మహ్మద్, కర్మాగారం వైద్యుడు రాజా కేశవప్రసాద్, సీనియర్ మేనేజర్ వెంకట శివాజీ, సర్పంచ్ లక్ష్మీ బాలాజీ, నాయకులు కట్టా నరసింహారావు, గడ్డం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామం నుంచి రెడ్డినాయక్‌తండా వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకుపోవటంతో రామ్‌కో యాజమాన్యం తన వంతు సహకారంతో రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో గత 20 రోజులుగా రాకపోకలు నిలిపివేసిన నేపథ్యంలో శనివారం నుంచి మరమ్మతులు పూర్తవటంతో రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు కర్మాగారం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

లడ్డూ ప్రసాదంలో వాస్తవాల నిగ్గు తేల్చాలి

- ఆలయాల్లో విశేష పూజలు
- పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, తన్నీరు



నందిగామలో పార్టీ శ్రేణులతో కలిసి స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జగ్గయ్యపేటలో పూజలు నిర్వహిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు, కౌన్సిలర్లు

నందిగామ టౌన్: తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయంలో వాస్తవాలను నిగ్గు తేల్చాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోత్రనామాలతో పూజలు చేయించారు. పూజల అనంతరం జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. దేవదేవుడు వెంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాద విషయంలో నెలకొన్న వివాదం త్వరితగతిన సమసిపోవాలని కోరుతూ పూజలు, అభిషేకాలు చేశామన్నారు.

లడ్డూ ప్రసాదానికి ఎంతో విశిష్టత..

వెంకటేశ్వర స్వామివారి ప్రసాదానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో విశిష్టత ఉందని ముఖ్యంగా లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తామని జగన్‌మోహనరావు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మనకున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి త్వరితగతిన వాస్తవాలను తెలిపి వివాదం సమసిపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు, పార్టీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, కొమ్ము విజయరాజు, మువ్వల శ్రీను, సూరె రామారావు, షేక్ కరిముల్లా, రామిరెడ్డి సీతయ్య, చిలుకూరి బుచ్చిరెడ్డి, రాచూరి సీతారాం, నాయుడు ఉదయలక్ష్మి, నల్లమల్లి మురళి, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, తోట అంజారావు, వడ్డెల్లి శ్రీను, షేక్ యాకుబ్ అలీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు చేసిన పాపానికి శిక్ష ప్రజలపై చూపవద్దు స్వామీ..

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్ర రాష్ట్రంలోనే కాకుండా భారత దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందిన తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులు పవిత్ర ప్రసాదంగా భావించే లడ్డూలలో జంతువుల కొవ్వు వాడారని అబద్ధపు ప్రచారం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన పాపానికి ఆగ్రహించ వద్దని కలియుగ దైవం వెంకటేశ్వరస్వామికి వైఎస్సార్ సీపీ శ్రేణులు పూజలు చేశారు. చేయని తప్పు జరిగిందంటూ రాజకీయాలలోకి తమ పవిత్ర లడ్డూలను తీసుకువచ్చి అపచారానికి పాల్పడినందుకు మీ ఆగ్రహాన్ని రాష్ట్ర ప్రజలపై చూపకుండా, అందుకు కారకుడైన చంద్రబాబుపైనే చూపాలంటూ జగ్గయ్యపేటలోని పాత వెంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన్‌నగర్‌లోని తన్నీరు నివాసం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ముందుగా కోదాడ రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సీతారామపురంలోని కొత్త వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని తిరుమల పవిత్రతను, శ్రీవారి ప్రసాదం విశిష్టతను, టీటీడీ పేరు ప్రఖ్యాతులను మంట గలిపిన చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు పూజలు చేశారు. తదనంతరం దేవాలయం బయట పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు.



పెద్దాపురంలో పూజలు చేస్తున్న పార్టీ మహిళా నాయకులు



అనిగండ్లపాడులో పూజలు నిర్వహిస్తున్న నాయకులు



పరిటాల రామాలయంలో పూజలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

స్వార్థ రాజకీయాలకు దైవాన్ని ఉపయోగించుకోవడం అపచారం..

ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు వాగ్దానాలు చేసి వాటి అమలులో పూర్తి వైఫల్యం చెందిన చంద్రబాబునాయుడు తన వంద రోజుల పాలనపై ప్రజల దృష్టిని మరల్చేందుకు తిరుపతి లడ్డూలలో కల్తీ జరిగిందని ప్రతిష్టను దిగజార్చే విధంగా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తన్నీరు తెలిపారు. లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన చంద్రబాబునాయుడు పాపానికి ప్రక్షాళన కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నామన్నారు. బాబుకు దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు చౌడవరపు జగదీష్, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి ఎల్.బద్దూనాయక్, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు, బలుసుపాడు, సుబ్బాయిగూడెం సర్పంచ్‌లు యడ్లపల్లి సూర్యప్రకాష్, పాపినేని వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి కన్నెమాల శామ్యూల్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వేములు మల్లేశ్వరరావు, పెనుగంచిప్రోలు మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ చల్లా వైకుంఠరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిషోర్, శివాలయం మాజీ చైర్మన్ గెల్లా పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అసత్య ప్రచారాలు దారుణం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): తిరుమల పవిత్రతను, శ్రీవారి ప్రసాదం విశిష్టతను టీటీడీ పేరు, ప్రఖ్యాతలను మంట గలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాల ప్రక్షాళన కోసం శనివారం గ్రామంలోని శివాలయం, రామాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం రాజకీయ లబ్ధికోసం, 100 రోజుల పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తప్పించుకోవటానికి చంద్రబాబు, కూటమి అసత్య ప్రచారాలు దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి పెంటయ్య, ఉన్నం శ్రీనివాసరావు, వూట్ల లక్ష్మయ్య, కోలా రామారావు, పాలాది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరిటాలలో పూజలు

కంచికచర్ల: సీఎం చంద్రబాబు చేసిన పాపాలు ప్రజలకు తగలకుండా ఉండేందుకు మండలంలోని పరిటాల రామాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాథరావులు మాట్లాడుతూ.. చంద్రబాబు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే మాట్లాడతారనన్నారు. టీటీడీలో ఇటీవల వాడని నెయ్యి తయారు కాని లడ్డూతో చంద్రబాబు దుర్మార్గ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ నెయ్యిని శ్రీవారి లడ్డూలో వినియోగించటం కాదు కదా కనీసం టీటీడీ గోడౌన్‌లోకి కూడా అధికారులు అనుమతించలేదని స్పష్టం చేశారు. చంద్రబాబు బుద్ధి మార్చుకుని తమ పార్టీ అధినేతపై చేసిన ఆరోపణలు మానుకోకపోతే ఆ శ్రీ వారి కోపాగ్నికి గురికాక తప్పదని అన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, ఏసుబాబు, జాన్‌బాబు వేముల నాగరాజు, వేముల శ్రీకర జీవరాజు, యద్దనపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించటం బాధాకరం..

పెద్దాపురం(వీరులపాడు): కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారి ప్రసాద పవిత్రతను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యవహరించటం బాధాకరమని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని పెద్దాపురం గ్రామంలోని దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో శనివారం పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత విద్వేషాలను రెచ్చగొట్టి స్వప్రయోజనం పొందాలని కొందరు తాపత్రయపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారు రానున్న కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

డిక్లరేషన్ రాజకీయ దురుద్దేశమే



మాట్లాడుతున్న జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: కలియుగ ప్రత్యక్ష దైవంగా విరాజిల్లుతున్న వెంకటేశ్వర స్వామి వారికి ముఖ్యమంత్రి హోదాలో పట్టువస్త్రాలు సమర్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు తిరుమల దర్శనానికి వెళ్తుంటే డిక్లరేషన్ అడగటంలో రాజకీయ దురుద్దేశం తప్ప మరొకటి లేదని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పట్టువస్త్రాలు సమర్పించిన వ్యక్తిని డిక్లరేషన్ అడుగుతున్నారంటే ప్రభుత్వాలు మారితే విధానాలు మారుతాయా అని ప్రశ్నించారు. తిరుమల వెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదంపై నెలకొన్న వివాదం త్వరగా సమసిపోవాలని ఆకాంక్షించారు. దీనిపై ఇప్పటికే పలువురు సుప్రీం కోర్టు, హైకోర్టులో పిల్స్ వేయటంతో పాటు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారాని గుర్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందా లేదా అనే విషయాన్ని తేల్చి వివాదానికి తెర దించాలని కోరారు.

పరమత సహనం కలిగిన ప్రజలు..

మన దేశం భిన్నత్వంలో ఏకత్వానికి పెట్టింది పేరని దేశ ప్రజలు పరమత సహనం కలిగిన వారని చెప్పారు. మన మతాన్ని ఎలా గౌరవిస్తామో మిగిలిన మతాలను కూడా అదే విధంగా గౌరవించే సంస్కృతిలో మనులుతున్నామని తెలిపారు. మిగిలిన మతాలను పూజిస్తాం.. గౌరవిస్తాం తప్ప పరమత దేషాన్ని మాత్రం ఎప్పుడూ చూపలేదన్నారు. ఎవరి మత సాంప్రదాయాలను వారు ఎలా గౌరవించుకుంటున్నారో మిగిలిన మతాల సాంప్రదాయాలను కూడా అదే విధంగా గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో రీ ఎన్యూమరేషన్



వేములపల్లిలో రీ ఎన్యూమరేషన్ చేస్తున్న అధికారులు

కంచికచర్ల: ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు కృష్ణానది తీర గ్రామాల్లో వరద నీరు చేరింది. మూడు రోజుల పాటు ఇళ్లలో వరద నీరు చేరటంతో అధికారులు బాధితులను పునరావాసకేంద్రాలకు తరలించారు. అయితే ముంపు గ్రామాల బాధితులకు పరిహారం అందించకపోవటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈ నెల 28న ముంపు ఇళ్లకు అందని పరిహారం అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలు జిల్లా కలెక్టర్ సృజన, రెవెన్యూ అధికారులతో మాట్లాడి కంచికచర్ల మండలంలోని ముంపునకు గురైన 9 గ్రామాల్లో రీ ఎన్యూమరేషన్ చేసి బాధితులకు పరిహారం అందజేయాలని ఆదేశించారు. ఆదేశాల మేరకు ముంపునకు గురైన మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, మోగులూరు, ఎస్.అమరవరం, పెండ్యాల, వేములపల్లి గ్రామాల్లో శనివారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు రీ ఎన్యూమరేషన్ చేపట్టారు. సాక్షి కథనంతో ఎన్యూమరేషన్ చేపట్టడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

నష్ట పరిహారం అందించాల్సిందే...

మండల వ్యాప్తంగా ఇళ్లలో విలువైన వస్తు సామగ్రి పూర్తిగా నష్టం జరిగిందని, అంతేకాకుండా వరదల్లో రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కంచికచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో వరదలు వచ్చిన సమయంలో పర్యటించానన్నారు. అయితే 9 గ్రామాల్లో ఇళ్లలో వరద నీరు చేరటంతో బాధితులకు తీవ్ర నష్టం జరిగిందని చెప్పారు. బాధితులకు పరిహారం ఇవ్వాలని నందిగామ ఆర్డీఓ కె.రవీంద్రరావు, తహసీల్దార్ వి.జాహ్నవిలను సూచించానన్నారు. స్పందించిన అధికారులు వరదలు తగ్గగానే ముంపు ప్రాంతాలను పరిశీలించి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని అధికారులు చెప్పారని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

ప్రభుత్వం ఆదుకోవాలని నిరసన



కంచికచర్ల: కంచికచర్ల జంగాల కాలనీలో వరద ముంపునకు గురై ఇప్పటికి బురదలోనే జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వ తమకు ఎటువంటి సహాయం అందించటంలేదని ప్రజలు, మహిళలు ఆరోపిస్తున్నారు. శనివారం కాలనీవాసులు మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షం కురిస్తే తమ కాలనీలో మోకాలు లోతు నీరు నిల్వ ఉంటుందన్నారు. తామంతా పొట్టకూటి కోసం కూలినాలి పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నామని తమ గుడిసెల్లో వర్షంనీరు వచ్చినా అధికారులుకాని నాయకులు కాని తమవైపు చూడలేదని, తమకు ప్రభుత్వం కనీసం కేజీ బియ్యం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. బూరలు, పిన్నీసులు, చెంప పిన్నులు వంటివి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నామని, ఆ సామాన్లు వర్షాలు కురవటంతో గుడిసెల్లో నీరు చేరటంతో తడిచిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గుడిసెల్లో వంట చేసుకునే పరిస్థితి లేదన్నారు. అయితే భిక్షాటన చేస్తూ జీవిస్తున్నామని తమ గోడును ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని తమ కుటుంబాలను ఆదుకోవాలని మహిళలు అంటున్నారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ, తిరపతమ్మ, మరియమ్మ, వెంకట్రావమ్మ, భవాని సత్యవతి, సీత సువార్త రాధ తదితరులున్నారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు స్వల్ప గాయాలు

జగ్గయ్యపేట: అదుపు తప్పి ఆటో బోల్తా పడటంతో నలుగురు విద్యార్థులు గాయపడిన సంఘటన జగ్గయ్యపేట మండలంలోని త్రిపురవరం వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు ఆటోలో జగ్గయ్యపేటలోని కళాశాలలకు బయలుదేరారు. ఈ క్రమంలో గ్రామంలోని మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటోలో మొత్తం 18 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరామర్శించారు.

దేవినేని అవినాష్‌ను కలిసిన తన్నీరు నాగేశ్వరరావు



అవినాష్‌కు అభినందనలు తెలియజేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను జగ్గయ్యపేట సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, పలువురు స్థానిక నాయకులు శనివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు, బొకెలు అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు. తన్నీరు వెంట విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, పెనుగంచిప్రోలు మాజీ మండల అధ్యక్షుడు ఊట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు, రాష్ట్ర ఎస్సీసెల్ మాజీ ప్రధాన కార్యదర్శి శామ్యూల్, న్యాయవాది సత్యశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే మా ఎజెండా



పేటలో తన్నీరు నాగేశ్వరరావును అభినందిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించారని, అందుకు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు నియమితులు కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసానికి తరలివచ్చి ఆయనకు అభినందనలు తెలియజేశారు. వారిని ఉద్దేశించి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ తనపై జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన గురుతర బాధ్యతను, నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజాపక్షంగా పోరాడతామన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటానన్నారు.

హిందువులకు దూరం చేసేందుకే కుట్ర..

జగ్గయ్యపేట అర్బన్: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లడానికి కూటమి ప్రభుత్వం అధిక సమయం కేటాయిస్తూ కుట్రలు చేస్తోందని మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆరోపించారు. సీతారామపురంలోని పాత వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కుల మతాల మధ్య విద్వేషాలు సృష్టించి చంద్రబాబు ఇటువంటి కార్యచరణ చేపట్టారని, దీనిని వైఎస్సార్ సీపీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు నాయకత్వంలో పూజల చేపట్టినట్లు తెలిపారు.

ప్రతి ఒక్క రైతును ఆదుకుంటాం

నందిగామ టౌన్: వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు నష్ట పరిహారం అందించి ఆదుకునేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ రవీంద్రరావు పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నాగమణిమ్మతో కలిసి మండలంలోని కొండూరు, మాగల్లు గ్రామాల రైతులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నష్టం అంచనాల తయారీలో అధికారులు సరిగా నమోదు చేయలేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. పంట నష్టం అంచనాల తయారీలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ సురేష్‌బాబు, అధికారులు ఉన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గుర్రం జాషువా తెలుగు సాహితీ లోకంలో దిగ్గజ వ్యక్తిగా నిలిచారని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జాషువా రచనలు, కవితల ద్వారా ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారని తెలిపారు. ఎంపీపీ ఆకుల హనుమంతరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు షేక్ కరిముల్లా, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, షేక్ యాకుబ్ అలీ, కొమ్ము విజయరాజు, వీసం దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పదో తరగతికి చెందిన షేక్ జాన్‌సైదా అనే విద్యార్థి ఏకధాటిగా 100 పద్యాలను ఆలపించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఆర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ నేటి తరాలకు కవులు, వారి చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాషువా రచనలను వివరించారు.

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



జె.వెంకటేశ్వర్లు



బి.సైదా

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ పేట మండల ద్వితీయ కార్యవర్గ సమావేశం సంఘ మండల అధ్యక్షుడు కె.రాజేంద్ర అధ్యక్షతన శనివారం జరిగింది. ఇటీవల జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఉపాధ్యాయుల సరీస్ సమస్యలను చర్చించారు. సంఘ రాష్ట్ర కౌన్సిలర్ టీవీఎల్ నరసింహారావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీహరి మాట్లాడుతూ.. జీఓ నంబర్ 117 ను రద్దు చేయాలన్నారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా బలుసుపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జె.వెంకటేశ్వర్లు, మండల ఆర్థిక కార్యదర్శిగా గండ్రాయి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బి.సైదా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎల్.వీరన్న పాల్గొన్నారు.